ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 22 ఆగస్టు 2024



హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో..



భూపాలపల్లి జిల్లా ఆస్పత్రిలో..



ములుగు జిల్లా ఆస్పత్రిలో..



మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో..



ఎంజీఎం ఆస్పత్రిలోని జ్వరాల వార్డులో చికిత్స పొందుతున్న చిన్నారులు

ఆంధ్రజ్యోతి ఫోకస్

జ్వర పంజా



జనగామ జిల్లా ఆస్పత్రిలో..

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ

జ్వరాలు పంజా విసురుతున్నాయి. అసలే వర్షాకాలం.. మరోవైపు పారిశుధ్య నిర్వహణ లోపంతో అపరిశుభ్రంగా మారుతున్న పరిసరాలు, దోమల వ్యాప్తి ఇందుకు కారణమవుతోంది. సీజనల్ వ్యాధుల నియంత్రణకు యంత్రాంగం చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం జటిలంగా మారుతోంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతుండటం జనాలను కలవరపెడుతోంది. ఓ వైపు ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు జ్వరబాధితులు ఉంటుండగా.. మరోవైపు చికిత్స కోసం వస్తున్న బాధితులతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. హనుమకొండ ఎంజీఎం, వరంగల్, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, జనగామ జిల్లా ఆసుపత్రులతో పాటు పీహెచ్‌సీల్లోని వార్డులు నిండిపోతున్నాయి. ఉమ్మడి జిల్లాకు ఎంతో కీలకమైన ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున రోగులు చికిత్స పొందుతుండగా మిగిలిన వార్డులు కూడా కిటకిటలాడుతున్నాయి. ఈ క్రమంలోనే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఇక ఈ జటిల పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుంటున్న ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు దందాకు తెరలేపుతున్నారు. చికిత్సలు, నిర్ధారణ పరీక్షల పేరుతో ఎక్కువ మొత్తంలో గుంజుతున్నారని, ప్లేట్‌లెట్స్ ఎక్కించేందుకు ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.11వేల నుంచి రూ.15వేల వరకు చార్జ్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

వివరాలు : 7లో..

డీఏవో ఉషాదయాల్ బదిలీ

- ఆదిలాబాద్‌కు స్థానచలనం
- కొత్త డీఏవోగా అనురాధ నియామకం

వరంగల్ వ్యవసాయం, ఆగస్టు 21: వరంగల్ జిల్లా వ్యవసాయశాఖ అధికారి(డీఏవో)గా పని చేస్తున్న ఉషాదయాల్ బదిలీ చేస్తూ బుధవారం ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయి. చాలాకాలంగా వరంగల్ జిల్లాలో వ్యవసాయశాఖ అధికారిగా ఉన్న ఉషా దయాల్‌ను ఆదిలాబాద్ డీఏవోగా బదిలీ చేసింది. ఆమె స్థానంలో భువన గిరి యాదాద్రి జిల్లా వ్యవసాయశాఖ అధికారిగా పని చేస్తున్న అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో భువనగిరి యాదాద్రి డీఏవోగా పని చేస్తున్న కె.అనురాధను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం గత నెల ఉద్యోగుల బదిలీల ప్రక్రియ చేపట్టిన విషయం తెలిసిందే. రైతు రుణ మాఫీ సక్రమంగా అందించడం కోసం వ్యవసాయశాఖలో బదిలీలను చేపట్ట లేదు. రుణమాఫీ కార్యక్రమాన్ని పూర్తి కావచ్చిన నేపథ్యంలో ఆ శాఖలోనూ బదిలీల ప్రక్రియను ప్రారంభించింది. ఇప్పటికే ఏవోలు, ఏడీఏల బదిలీలు కూడా పూర్తయ్యాయి.



కాశిబుగ్గ పీహెచ్‌సీలో వైద్యసేవలను రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



వంచనగిరిలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్

జ్వరం వస్తే పీహెచ్‌సీకి వెళ్లాలి

- వైద్యులు సమయం పాటించాలి : కలెక్టర్
- కాశిబుగ్గ, దేశాయిపేట పీహెచ్‌సీల సందర్శన

వరంగల్ సిటీ, ఆగస్టు 21: దగ్గు, జలుబు, జ్వరం వస్తే వెంటనే దగ్గర లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకో వాలని కలెక్టర్ సత్యశారద నగరవాసులకు సూచించారు. బుధవారం కాశిబుగ్గ, దేశాయిపేట పట్టణ ప్రా థమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. డెంగీ, మలేరియా విషజ్వరాలు, ల్యాబ్ టెస్టుల రిజి స్టర్‌ను పరిశీలించారు. ఈనెలలో నమోదైన డెంగీ కేసులు, రోజువారి రోగుల వివరాలు డాక్టర్స్‌ను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, రోగులకు మెరుగైన సేవలందించాలని వైద్యులకు సూచించారు. రోగుల కు మెరుగైన సేవ లందించాలని, విదుల్లో అలసత్వం పాటిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్, తహసీల్దార్ ఎక్బాల్, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

గీసుగొండ: విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. వంచనగిరి మోడల్‌స్కూల్, కళాశాలను, హాస్టల్ వసతి గృహాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రవిందర్, ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ఎస్‌వో హిమబిందు, కేర్ టేకర్ అరుణ, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

ఆడపిల్లల్లో ధైర్యాన్ని నింపాలి

- స్నేహ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాకటి కరుణ



మీటింగ్ మాట్లాడుతున్న వాకటి కరుణ

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 21: బాలిక సంఘాలు ఆడపిల్లల్లో ధైర్యాన్ని నింపాలని, బాల్యవివాహాలు, సైబర్ సేఫ్టీ అంశాలపై ఆడపిల్లలను చైతన్యవంతుల్ని చేయాలని మహిళా, స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వాకటి కరుణ సూచించారు. స్నేహ కార్యక్రమంపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని జూమ్ మీటింగ్ ద్వారా వాకాటి కరుణ బుధవారం పర్యవేక్షించారు. డీఆర్‌డీవో కార్యాలయంలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాఖపరంగా తీసుకోవాల్సిన చర్యలు, విధి విధానాలను వివరించారు.

స్నేహ కార్యక్రమాన్ని విజయవంతంగా ముం దుకు తీసుకెళ్లేందుకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో కౌస ల్యాదేవి, యూనిసెఫ్ నుంచి మురళి, జోన్స్, డీడబ్ల్యూవో హైమావతి, డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు, సీడీపీవోలు, చైల్డ్ ప్రొటెక్షన్, సఖీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా రాజశేఖర్‌రెడ్డి



వరంగల్ లీగల్, ఆగస్టు 21: రైల్వే కేసుల పరిష్కారం కోసం ప్రత్యేక జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా కె.రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం ప్రకటన వెలువరించారు. ఆయన ఈ పోస్టులో యేడాదిపాటు కొనసాగుతారు. రైల్వేకు సంబంధించిన కేసులు కాజీపేటలోని రైల్వే కోర్టులో పరిష్కరిస్తారు.

విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

- గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కల్లెడ కళాశాలలో సిబ్బంది క్వార్టర్లు ప్రారంభం

6



కార్యక్రమంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



విల్లు ఎక్కుపెట్టిన ఇంద్రసేనారెడ్డి

నగరంలో సీపీఐ జాతీయ సమావేశాలు

- నేటి నుంచి 24 వరకు నిర్వహణ
- హనుమకొండలో ఎర్రజెండాలతో స్వాగత ఏర్పాట్లు పూర్తి



బాలసముద్రం, ఆగస్టు 21: సీపీఐ జాతీయ సమావేశాలకు హనుమకొండ వేదికగా మారింది. తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ నిర్మాణ సమావేశాల కోసం హనుమకొండలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి ఆధ్వర్యంలో నగరంలో ఎర్రజెండాలతో స్వాగత ఏర్పాట్లు బుధవారం పూర్తి చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్క ళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హనుమకొండలోని హరి త కాకతీయ హోటల్ వేదికగా గురువారం నుంచి 24 వతేదీ వరకు మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్య దర్శి, మాజీ ఎంపీ డి.రాజా జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, మాజీ ఎంపీ అజీజ్‌పాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి క్తొగూడెం ఎమ్మె ల్యే కూనంనేని సాంబశివరావు హాజరుకానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహంతో పాటు భవిష్యత్ కార్యాచరణను రూపొందించ డంపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ప్రధాన కూడళ్లలో వాల్‌రైటింగ్, సీపీఐ జెండాలను ఏర్పాటు చేసినట్లు శ్రీనివాసరావు, కర్రె భిక్షపతి తెలిపారు.

బీఆర్‌ఎస్ దారెటు?

- వర్ధన్నపేటలో అయోమయ పరిస్థితి
- నియోజకవర్గ ఇన్‌చార్జ్ లేక తిప్పలు
- ముంచుకొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు
- నాయకుడు లేక క్యాడర్‌లో నిర్లిప్తత

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 21 : వర్ధన్నపేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ పరిస్థితి రోజురోజుకూ తీసుకట్టుగా మారుతోంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో ఘోరా పరాభవం ఎదుర్కొన్న పార్టీకి ఆ తర్వాత కూడా ఏమాత్రం కలిసి రావడం. పదేండ్లపాటు ఏకచత్రాధి పత్యంతో నడిపించిన అప్పటి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ బీజేపీలోకి వెళ్లిన నాటి నుంచి కార్యకర్తల్లో అయోమయం నెలకొంది. ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జి అధికారికంగా లేకపోవడంతో తమ గోడు వినేవారు కరువయ్యారని కార్యకర్తలు వాపోతున్నారు.

అటకెక్కిన కమిటీలు...

రెండేళ్లకోసారి జరగాల్సిన బీఆర్‌ఎస్ గ్రామ, మండల కమిటీలు అటకెక్కాయి. సభ్యత్వాలను సైతం సంవత్సరం పాటు అధిష్ఠానం పొడిగించింది. సెప్టెంబరు 15తో సభ్యత్వాల తేది ముగుస్తుంది. సర్పంచ్ ఎన్నికలకు గడువు ముంచుకొస్తున్న నేపథ్యంలో కమిటీలు మరింత జాప్యమయ్యే అవకాశం ఉందని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. వర్ధన్నపేట పట్టణానికి సైతం పార్టీ అధ్యక్షుడు లేకపోవడంతో క్యాడర్‌కు కొత్త చిక్కులు తెస్తున్నాయి. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చూసుకుంటానని మౌఖికంగా చెబుతున్నా, అధికారికంగా ఎవరు లేకపోవడంతో డైలమాలో పడ్డారు. వచ్చే ఎన్నికల వరకు జనరల్ అయ్యే అవకాశం ఉండడంతో, ఆ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే పెట్టాలని ఆలోచిస్తోంది. ఇటీవల కాలంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపడతారని ప్రచారం జరిగినా, ఇంకా క్లారిటీ రాకపోవడంతో క్యాడర్ కలత చెందుతోంది. సెప్టెంబరులో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు సర్కారు దాదాపు ఖరారు చేసింది. ఈ సమయంలో నియోజకవర్గ లీడర్ లేకపోవడంతోపాటు పార్టీని పటిష్ఠంగా చేసే వ్యక్తులు సైతం కరువయ్యారు.



ఆశావహుల్లో గుబులు..

సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచే ఆశావహుల్లో గుబులు మొదలైంది. క్యాడర్ సరిగ్గా లేనప్పుడు పోటీ చేసి అప్పుల పాలు కావాలా అంటూ వాపోతున్నారు. అధికారంలో లేకపోవడం, భారీగా డబ్బులు పెట్టి గెలిచినా ప్రయోజనం ఏంటనే అంతర్మథనం సాగుతోంది. ఒక్కో సర్పంచ్ అభ్యర్థి రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. దీంతో గులాబీ నాయకులు ఇప్పటి నుంచి వాటిపై దృష్టి సారిస్తున్నారు.

చేజారుతున్న క్యాడర్..

వర్ధన్నపేటలో బీఆర్‌ఎస్ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు చాలామంది నేతలు బీజేపీ, కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇప్పటికే ఆయా మండలాల్లో అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెడుతుండగా, ఇక్కడ మాత్రం అంతా స్తబ్ధుగా మారింది. మాజీ మంత్రి దయాకర్‌రావు వచ్చినప్పుడు మాత్రమే నాయకులు కలుసుకోవడం ప్రతిక ప్రకటన ఇవ్వడంతో సరిపెడుతున్నారు. జయంతులు, వర్ధంతులు తప్ప ప్రజల సమస్యలపై పోరాటం చేయడంలో విఫలమవుతున్నారు. ఇటీవల ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం సైతం ముగియడంతో వారి జాడ కనిపించడం లేదు. అలాగే వర్ధన్నపేట పట్టణంలో పార్టీని నడిపించే ముఖ్య నాయకుడు కరువయ్యాడు. కౌన్సిలర్ల దుస్థితి పొయ్యిలో పడ్డ పెనంలా తయారైంది. కొందరు కాంగ్రెస్, మరికొందరు బీజేపీ పంచన చేరడంతో అలాగే బీఆర్‌ఎస్ ఉన్న వారు ఇల్లు దాటి బయటకు రావడం లేదు.











విలువిద్యలో అంతర్జాతీయ గుర్తింపు

● గ్రామీణ విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తున్న ఆర్డీఎఫ్ ● త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి


డ్రోన్‌తో పురుగుల మందు పిచికారీని పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి

పర్వతగిరి, ఆగస్టు 21: ఆర్చరీ అకాడమీ ఏర్పాటు చేసి విలువిద్యలో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పతకాలు సాధించిన ఘనత రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ (ఆర్డీఎఫ్)దేనని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడలో ఆర్డీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వనితా అచ్యుతాపాయ్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులకు నిర్మించిన క్వార్టర్లు, ఒకేషనల్ కోర్సులు, ల్యాబ్‌లను నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఆర్డీఎఫ్ ఆర్చరీ అకాడమీలో విలు విద్యకారులతో మాట్లాడి విల్లు ఎక్కుపెట్టారు. పొలంలో పురుగుల మందును పిచికారీ చేసే డ్రోన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ 26ఏళ్ల క్రితం ఆర్డీఎఫ్‌ను స్థాపించి విద్యాలయాలను ఏర్పాటు చేయడమే గాకుండా, వివిధ ప్రాంతాలకు బ్రాంచ్‌లను విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా గ్రామీణ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందిస్తున్న ఆర్డీఎఫ్ సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో గతంలోనే కమ్యూనిటీ టాయిలెట్లను నిర్మించారని, కాలేజీ స్టాఫ్ కోసం డబుల్‌బెడ్రూం క్వార్టర్లు నిర్మించడంపై రామ్మోహన్‌రావుకు విద్యపై ఉన్న ఆసక్తిని తెలియజేస్తుందన్నారు. సంస్థకు విరాళాలు అందించే దాతలకు సైతం సంస్థలో విద్యనభ్యసించే విద్యార్థుల ఫలితాలు కూడా ఉత్తేజపరుస్తున్నాయన్నారు. బాలికల విద్యను పెంపొందించాలనే ఉద్దేశంతో పాఠశాల, కళాశాలలో బాలికలకు 50శాతం సీట్లు కేటాయిస్తూ, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఉచిత విద్య, వసతి కల్పిస్తున్నారని అన్నారు.

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నో ఒడిదుడుకులు వచ్చినా అంకితభావంతో పనిచేస్తున్న ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావును అభినందించారు. ఆయన తండ్రి వెంకట్రాంనర్సయ్య సైతం గతంలో సేవాభావంతో ఎన్నో పనులను చేశారని, జిల్లా పరిషత్ తొలి చైర్మన్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా సేవలందించారని గుర్తు చేశారు. ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ దాతల సహకారంతోనే పేద విద్యార్థులకు విద్యను అందించగలుగుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఆర్డీఎఫ్ సెక్రటరీ కిరణ్ అడ్డాల, అనంతపాయ్, ప్రిన్సిపాల్ ఆడెపు జనార్దన్, పాఠశాల హెచ్‌ఎంలు అశోకాచారి, విష్ణు, నాయకులు విజయ్‌చందర్‌రెడ్డి, రావు పద్మ, కొండేటి శ్రీధర్, బొంపెల్లి దేవేందర్‌రావు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేపీ నేతలు

మండలంలోని కల్లెడ గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డిని బుధవారం పలువురు బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్, వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఎస్సీ సెల్ రాష్ట్ర సభ్యుడు కొండేటి శ్రీధర్, జిల్లా నాయకుడు పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పట్టాపురం ఏకాంతంగౌడ్, బొట్ల మధు, సంతోష్ పాల్గొన్నారు.


ల్యాబ్‌లో పరికరాలను పరిశీలిస్తున్న ఇంద్రసేనారెడ్డి












వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద కిటకిటలాడుతున్న రోగులు

'జ్వర' పంజా



- డెంగీ, మలేరియా, తదితర జ్వరాలతో మంచం పడుతున్న జనం
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు క్యూ

ఉమ్మడి జిల్లాలో సీజనల్ వ్యాధుల విజృంభణ

ఉమ్మడి వరంగల్ జిల్లాపై జ్వరాలు పంజా విసురుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడుతుండటంతో పాటు వాతావరణ మార్పులతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా ప్రతీ ఇంట్లో జ్వరబాధితులు మంచాలు పడుతున్నారు. ఈ క్రమంలో చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే మరణాలు కూడా సంభవిస్తుండటంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో జ్వరాలు ప్రబలుతున్న తీరుపై 'ఆంధ్రజ్యోతి' ఫోకస్

వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు

మలేరియా ప్రబలుతున్నా లెక్కల్లో లేని వైనం

పోచమ్మమైదాన్, ఆగస్టు 21: వరంగల్ జిల్లా వాసులను జ్వరాల తీవ్రత కలవరానికి గురిచేస్తోంది. జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్లతో బాధపడుతున్న వారు ఇంటికొకరు ఉంటున్నారు. డెంగీ, మలేరియా లాంటి కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. దాంతో ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. డెంగీ లక్షణాలతో అనేక మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. 20రోజుల వ్యవధిలోనే వరంగల్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదైనట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాలు, పట్టణాలు తేడా లేకుండా జ్వర పీడితులు రోజురోజుకు పెరుగుతున్నారు. వివిధ రకాల వైద్యపరీక్షల కోసం వచ్చినవారితో ల్యాబ్‌లు, డయగ్నాస్టిక్ సెంటర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు, మెడికల్ షాపులు రోగులతో నిండిపోతున్నాయి. నగరంతోపాటు శివారు ప్రాంతాలలోనూ డెంగీ కేసులు పెరుగుతున్నాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. చిన్నారుల సైతం జ్వరంతో బాధపడుతుండగా పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో వ్యాధుల వివరాలను యాజమాన్యాలు బయటకు రానివ్వడం లేదని, దీంతో నమోదైయ్యే కేసుల వివరాలు ప్రభుత్వ అధికారుల లెక్కలోకి రావడం లేదని తెలుస్తోంది. 2022లో 161, 2023లో 160 డెంగీ కేసులు నమోదవగా ఈ ఏడాది ఎనిమిది నెలల్లో జిల్లాలో మొత్తం 82డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

అలాగే అనేక మంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నప్పటికీ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం మలేరియా, చికున్‌గున్యా కేసులు నమోదవడం లేదని చెబుతుండటం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకు ఏప్రిల్‌లో 3, జూలైలో 3, ఆగస్టులో 2 మలేరియా కేసులు మొత్తం 8 కేసులు మాత్రమే మలేరియా కేసులు నమోదయ్యాయని చెబుతున్నారు. కానీ బయట పరిస్థితి చూస్తే అనేకమంది మలేరియా, చికున్‌గున్యాతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. 2022లో 45, 2023లో 7 మలేరియా కేసులు నమోదవగా, ఈ ఏడాది ఆగస్టు 20 వరకు ఎనిమిది కేసులు నమోదయ్యాయి.

డెంగీ డేంజర్ బెల్స్

భూపాలపల్లి జిల్లాలో 23 కేసులు

భూపాలపల్లి కలెక్టరేట్, ఆగస్టు 21: భూపాలపల్లి జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. మలేరియా, డెంగీ పాజిటివ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా డెంగీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గత రెండు రోజుల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు 23 మంది ఈ మహమ్మారి బారిన పడ్డారు. అలాగే ఐదు మలేరియా కేసులు నమోదయ్యాయి. ఇవి అధికారిక లెక్కలు మాత్రమే. వైద్యాధికారుల దృష్టికి రాని కేసులో జిల్లాలో అధికంగానే ఉన్నాయని తెలుస్తోంది. విషజ్వరాలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఆస్పత్రుల బాట పడుతున్నారు. పల్లెల్లో పారిశుధ్యం లోపించడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. విషజ్వరాలు వ్యాపిస్తున్న గ్రామాల్లో అధికారులు నామమాత్రంగా వైద్య శిబిరాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ప్రతీ ఏడాది జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో దోమల వల్ల ప్రజలు రోగాల బారినపడకుండా దోమతెరలను పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు అదెక్కడా కానరావడం లేదు.

ఏటా పెరుగుతున్న విషజ్వరాలు

జిల్లాలో విషజ్వరాలు ఏటా పెరుగుతున్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గతేడాది 83కుపైగా డెంగీ కేసులు నమోదయ్యాయి. 2022లో ఏడు, 2021లో 11, 2022లో 42, 2023లో 85 నమోదయ్యాయి. ఈ 8నెలల్లోనే 23 కేసులు నమోదవగా మరో నాలుగు నెలల్లో ఇంకా పెరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మరోవైపు మలేరియా కేసులు కూడా జిల్లాలో అక్కడక్కడ నమోదవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు ఐదుగురు దీని బారిన పడ్డారు. చికున్‌గున్యా కేసులు మాత్రం నాలుగేళ్లలో కానరాలేదు. 2020 నుంచి నేటివరకు నమోదవలేదని వైద్యవర్గాలు పేర్కొంటున్నాయి. గత 24 గంటల్లో మూడు పాజిటివ్ కేసులు నమోదవగా భూపాలపల్లి, రేగొండ, కాటారం పీహెచ్‌సీల పరిధిలో ఒకొక్కరు చొప్పున జ్వరాల బారిన పడ్డారు. ఇక జిల్లాలో నమోదైన 23 కేసుల్లో అత్యధికంగా భూపాలపల్లి పరిధిలోనే ఉన్నాయి.

ఆస్పత్రులకు క్యూకడుతున్న ప్రజలు

జ్వరాలతో ప్రజలు ఆస్పత్రుల బాటపడుతున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్) రోగుల తాకిడి విపరీతంగా ఉంది. రోజూ 650మంది ఓపీ పరీక్షలు చేయించుకుంటున్నారని, వీరిలో 500కు పైగా మంది జ్వరాలతో బాధపడే వారే ఉన్నారని తెలుస్తోంది. దీంతో ఈ ఆస్పత్రిలో ప్రత్యేకంగా ఆరు పడకల మెడికల్ ఐసీయూను ఏర్పాటు చేశారు. టీ-హబ్‌లో రోజూ జిల్లాలోని 13 పీహెచ్‌సీలు, రెండు సీహెచ్‌సీల నుంచి వచ్చిన 80-100 శ్యాంపిళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నారు. మంగళవారం వచ్చిన 80శాంపిల్స్‌లో మూడు పాజిటివ్‌గా నిర్ధారణైంది.



భూపాలపల్లిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో కిటకిటలాడుతున్న వార్డులు

మంచానికి ఇద్దరు..

జ్వరబాధితులతో ఎంజీఎం కిటకిట

హనుమకొండ జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బాధితులు

పీహెచ్‌సీలకు క్యూ కడుతున్న జనం



ఎంజీఎం ఓపీలో బారులు తీరిన రోగులు

వరంగల్ మెడికల్, ఆగస్టు 20: ఉమ్మడి జిల్లాలో జ్వరాలు పంజా విసురుతున్నాయి. డెంగీ, మలేరియా, ఇతర వైరల్ ఫీవర్లతో జనం సతమతమవుతున్నారు. ప్రస్తుతం ప్రతీ ఇంట్లో ఒక్కరైనా జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఏ ప్రైవేటు ఆస్పత్రి చూసినా రోగులతో కిటకిటలాడుతోంది. ఇక ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉన్నా అంతకంటే వేగంగా వైరస్ విస్తరించడం పట్ల వైద్యులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో పిల్లల వార్డుతోపాటు జనరల్ మెడిసిన్ విభాగంలో మంచానికి ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్నారు. వార్డులన్నీ కిటకిటలాడుతున్నాయి. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కూడా జ్వర బాధితులు క్యూ కడుతున్నారు.

వైద్య పరీక్షలు కీలకం

ఆంధ్రజ్యోతి ఫోకస్ focus

డెంగీ వ్యాధి నిర్ధారణలో వైద్య పరీక్షలు కీలకంగా మారాయి. ఐజీఎం పరీక్షలతోనే కచ్చితత్వం ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఆర్‌డీటీ ప్లేట్‌లెట్ కౌంట్, సీరం టెస్ట్ విధానంలో పరీక్షలు నిర్వహించడం సరికాదని సీనియర్ వైద్యులు చెబుతున్నారు. ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ పరీక్షలు 100 శాతం నమ్మశక్యం కాదని అంటున్నారు. యాంటిజెన్ పాజిటివ్ ఉంటేనే 100శాతం వ్యాధి ఉన్నట్లు నిర్ధారించుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు.

దండుకుంటున్న ప్రైవేటు ఆస్పత్రులు

హనుమకొండ, వరంగల్ నగరాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ వైరల్ ఫీవర్ బాధితులతో కిటకిటలాడుతున్నాయి. కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులు.. పరిస్థితులను ఆసరా చేసుకుని దండుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. దీంతో జ్వరానికి చికిత్సకు రూ.50వేల నుంచి లక్షకు పైగానే ఖర్చు చేయాల్సిన దుస్థితి ఎదురవుతోంది. ములుగురోడ్డులోని ఓ కార్పొరేట్ ప్రైవేట్ ఆస్పత్రి తమ ఐదు అంతస్థులను ఫీవర్ వార్డులుగా మార్చి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా బాలసముద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి జ్వరం వచ్చారంటే చాలు.. అడ్మిట్ అయితేనే చికిత్స అంటూ రోగులను భయభ్రాంతులకు గురిచేస్తూ కరోనా కాలం కంటే ఎక్కువ సొమ్మును కాజేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

అధిక ధరలకు 'ప్లేట్‌లెట్స్'

ప్లేట్‌లెట్స్ పడిపోయినప్పుడు అందించే సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్‌లను ఈ సీజన్ అదనుగా చూసుకొని అధిక ధరలకు ఇస్తున్నట్లు రోగులు వాపోతున్నారు. ఆస్పత్రి స్థాయిని బట్టి ఈ ప్లేట్‌లెట్లను రూ.11వేల నుంచి రూ.15వేల వరకు విక్రయిస్తున్నారని, పేదల ఆస్పత్రి అయిన ఎంజీఎంలో ఈ యంత్రం లేకపోవడంవల్ల ప్రైవేట్ వైపు మొగ్గు చూపాల్సి వస్తోందని ఆవేదన చెందుతుఉన్నారు.

ముందు జాగ్రత్తలు

డెంగీ జ్వరం వస్తే తీవ్రత తగ్గించేందుకు చల్లని నీటితో మెత్తని వస్త్రం లేదంటే స్పాంజీని ముంచి శరీరాన్ని తుడవాలి. తక్షణశక్తినిచ్చే పౌడర్లు, పండ్ల రసాలు తాగించాలి. దీనివల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. ప్రతి ఒక్కరూ ఫ్రైడేను డ్రైడేగా పాటించి పరిసరాల పరిశుభ్రత పాటించాల్సి ఉంటుంది. డెంగీని గుర్తిస్తే 20 శాతం వరకు ఎలాంటి ప్రమాదం లేకుండా చికిత్స పొందవచ్చునని వైద్యులు చెబుతున్నారు.



ఎంజీఎంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఎంజీఎంలో డెంగీ, మలేరియా కేసులు

సంవత్సరం	మలేరియా	డెంగీ	చికున్‌గున్యా
2020	194	73	0
2021	310	128	0
2022	229	615	0
2023	93	821	0
2024	23	234	0

ప్లేట్స్‌లెట్స్ తగ్గితే సొంత వైద్యం వద్దు..

డాక్టర్ దుర్గం వెంకటేశ్, ఫిజిషియన్, ఎంజీఎం



ప్లేట్‌లెట్ సంఖ్య తగ్గితే సొంత వైద్యం చేయిం చుకోవద్దు. వైద్యుల పర్యవేక్షణలోనే చికిత్స పొం దాలి. వైరల్ జ్వరం వచ్చిన వారు హెపటైటిస్ పరీక్ష చేయించుకోవడం ఉత్తమం. చాలా మంది డెంగీ బాధితులకు బొప్పాయి పండు తినడం వల్ల కడుపునొప్పి, వాంతులు లాంటివి ఉంటాయి. తీవ్రమైన జ్వరం, శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.



మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం బారులు తీరిన రోగులు, బంధువులు

మానుకోట జిల్లాలో మరింత విజృంభణ

● ఇప్పటికే ఇద్దరు మృతి ● 250 డెంగీ, 12 మలేరియా కేసులు నమోదు

మహబూబాబాద్, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణాలు, గ్రామాలు, తండాలు.. ఇలా మహబూబాబాద్ జిల్లాలో జ్వరాలు మరింత విజృంభిస్తున్నాయి. ప్రతీ ఇంట్లో ఒకరిద్దరు చొప్పున జ్వరబాధితులు మంచం పట్టారు. దీంతో జనం జ్వర భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. ఇప్పటికే జిల్లాలో జ్వరాలతో ఇద్దరు మృతి చెందడంతో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. డెంగీ, మలేరియా, జ్వరాలు వ్యాప్తి పెరగడంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులన్నీ రోగులతో కిటకిటలాడుతున్నాయి. జిల్లాలోని కేసముద్రం మండలం బేరువాడకు చెందిన ఒకరు, తొర్రూరు మండల కేంద్రానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి మృతి చెందారు. జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా కేసులు నమోదవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో 250 డెంగీ, 12మలేరియా కేసులు, 48,664 మంది ఇతర జ్వరాలతో బాధపడుతున్నట్లు వైద్యాధికారులు గుర్తించారు. జిల్లా జనరల్ ఆస్పత్రిలో రోజూ 1600 నుంచి సుమారు 2 వేల మంది వరకు ఓపీ పేషెంట్లు వస్తుండగా, అందులో సగానికి పైగా జ్వర లక్షణాలున్నవారేనని వైద్యులు చెబుతున్నారు. జిల్లాలోని కొత్తగూడ, అయోధ్యపురం, తీగలవేణి, ముల్కనూరు, కురవి, డోర్నకల్ మల్యాల, మహబూబాబాద్ అర్బన్, కేసముద్రం, నెల్లికుదురు, మరిపెడ ప్రాంతాల్లో అధికంగా డెంగీ, మలేరియా జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల పరిధిలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

మానుకోట జిల్లాలోని 21 పీహెచ్‌సీల్లో కేసులు నమోదయ్యాయిలా..

సంవత్సరం	డెంగీ	మలేరియా	ఇతర వ్యాధి
2022	125	20	–
2023	40	06	–
2024	250	12	48,664



మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ వద్ద భారీగా ఉన్న రోగులు

నామమాత్రంగా వైద్య శిబిరాలు

విస్తారంగా వర్షాలు కురవడం, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యాధికారులు.. నామ్‌కేవాస్తేగా పల్లెల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉంది. దీనికి తోడు గ్రామపంచాయతీ పాలక మండలి పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించి వ్యాధుల నియంత్రణకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి..

గుండాల మురళీధర్, ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో, మహబూబాబాద్



సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇతర ఆరోగ్య సూత్రాలు పాటించాలి. ఏ మాత్రం అలసట అనిపించినా వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

దోమలమందు పిచికారీ చేయాలి

బానోత్ విష్ణు, సీరోలు, మహబూబాబాద్ జిల్లా



వరుసగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని మురుగుకాల్వలు, కుంటల్లో నీరు నిలిచిపోయింది. దీంతో ఆయా ప్రాంతాల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. అధికారులు గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయాలి. దీంతో పాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించాలి.

వణుకుతున్న ఏజెన్సీ గ్రామాలు

● ప్రబలుతున్న జ్వరాలతో గిరిబిడ్డల బెంబేలు ● కొనసాగుతున్న ఫీవర్ సర్వే

ములుగు, ఆగస్టు 21: ఏజెన్సీ పల్లెల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. వానాకాలం ప్రారంభమైన తర్వాత ఊళ్లకుఊళ్లు మంచం పడుతున్నాయి. ఏ ఇల్లు చూసినా ఒకరిద్దరు జ్వర పీడితులు కనిపిస్తున్నారు. వ్యాధుల నివారణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ పారిశుధ్య నిర్వహణలో లోపం, కలుషితతాగునీరు, వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులకు అడ్డుకట్ట పడడంలేదు. ఈ క్రమంలోఆస్పత్రులు జ్వరబాధితులతో నిండుతున్నాయి. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, వెంకటాపురం(నూగూరు) సామాజిక వైద్యశాలలతోపాటు 15 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలకు నిత్యం వందలాది మంది జ్వరపీడితులు వస్తున్నారు. ఏరియా ఆస్పత్రి, సామాజిక వైద్యశాలల్లో బెడ్లన్నీ నిండిపోతుండగా పీహెచ్‌సీలలో అందుబాటులో ఉన్న బెడ్లపై చికిత్స అందిస్తున్నారు.

రెండునెలల్లో 67 డెంగీ, మలేరియా కేసులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రతిఏటా ఇంటింటా ఫీవర్ సర్వేలు నిర్వహిస్తోంది. సమస్యాత్మక గ్రామాలను ముందే గుర్తించి క్లోరినేషన్, దోమల నివారణ మందును పిచికారీ చేయిస్తోంది. ములుగు జిల్లాలో ఈసారి 123 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ముందస్తు వ్యాధుల నివారణ చర్యలు చేపట్టారు. అయినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. జూన్, జూలై, ఆగస్టు 20 వరకు నిర్వహించిన జ్వర సర్వేలో 60,136 మందికి జ్వరం సోకినట్లు తేలింది. వీరందరి రక్త నమూనాలు సేకరించి పరీక్షించగా 34 మందికి మలేరియా, 33 మందికి డెంగీ నిర్ధారణ అయింది. అత్యధికంగా ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి వచ్చిన రోగుల్లో 21 మందికి డెంగీ, 13 మందికి మలేరియా నిర్ధారణ అయింది.

ఆందోళన కలిగిస్తున్న మరణాలు

జ్వరంతో బాధపడుతున్న పలువురు ప్రాణాలు కోల్పోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే... ఈ మరణాలను వైద్య ఆరోగ్యశాఖ నమోదు చేయలేదు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మృతిచెందినట్లు పేర్కొంటున్నారు. ములుగు మండలం జాకారంలో ఇటీవల ఓ నిండు గర్భిణి, వాజేడు మండలానికి చెందిన మరో గర్భిణి జ్వరంతో బాధపడుతూ మరణించారు. వాజేడు మండలానికి చెందిన మరో మహిళ కూడా డెంగీ లక్షణాలతో మృతిచెందింది. మంగపేట మండలంలో మూడునెలల కాలంలో తొమ్మిది మంది జ్వరంతో మరణించినట్లు తెలుస్తోంది.



కన్నాయిగూడెం పీహెచ్‌సీకి వచ్చిన బాలింత

పీహెచ్‌సీలకు ప్రత్యేక నిధులు

జ్వరాలు విజృంభిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పీహెచ్‌సీలకు కలెక్టర్ ప్రత్యేక నిధులను కేటాయించారు. మంత్రి సీతక్క ఆదేశాలతో ఒక్కో పీహెచ్‌సీకి రూ.50వేల చొప్పున మంజూరు చేశారు. వీటితో అవసరమైన మలేరియా, డెంగీ టెస్టింగ్ కిట్లను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా ములుగులోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేసి వైద్యులతో సమీక్ష జరిపిన కలెక్టర్ మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. టీ-డయాగ్నోహబ్‌లో లోపాలను గుర్తించి సాంకేతిక సమస్యలను పరిష్కరించి వ్యాధి నిర్ధారణ పరీక్షలను పునరుద్ధరించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చర్యలు చేపడుతున్నారు.



మంగపేట పీహెచ్‌సీకి వచ్చిన జ్వరపీడితులు



ములుగు ఏరియా ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న దృశ్యం

జనగామలో హైఫీవర్

జిల్లాలో పెరుగుతున్న 53 డెంగీ కేసులు

జనగామ, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి) : జనగామ జిల్లాను హైఫీవర్ వెంటాడుతోంది. సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విషజ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలవుతున్నారు. జ్వరాలతో వచ్చే బాధితులతో జిల్లాకేంద్రంలోని ప్రధాన ఆసుపత్రితో పాటు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. పట్టణం, పల్లె అనే తేడా లేకుండా పారిశుధ్య నిర్వహణ లోపం కారణంగా జిల్లాలో దోమలు, ఈగలు బెడద తీవ్రంగా ఉండటంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇటీవల 'స్వచ్ఛదనం-పచ్చదనం' పేరుతో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినా అవి తూతూమంత్రంగానే సాగాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో సీజనల్ కేసులు పెద్దసంఖ్యలో నమోదవుతున్నా అవన్నీ లెక్కలోకి రావడం లేదు. అయితే జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు పీహెచ్‌సీల్లో నిర్ధారణైన కేసులు మాత్రమే అధికారికంగా నమోదవుతున్నాయి. జిల్లాలోని 12 గ్రామాల పరిధిలో ఒక జిల్లా ఆసుపత్రి, 4 సీహెచ్‌సీలు, 13 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటితో పాటు గ్రామాల్లో ఆర్‌ఎంపీలు, జిల్లాకేంద్రంతో పాటు స్టేషన్‌ఘన్‌పూర్, పాలకుర్తి లాంటి నియోజకవర్గ కేంద్రాల్లో పదుల సంఖ్యలో ఉన్న ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ రోగులు చికిత్స తీసుకుంటున్నారు. ప్రైవేటుగా చికిత్స తీసుకుంటున్న వారి వివరాలు రికార్డ్ కావడం లేదు. దీంతో జిల్లాలో ప్రభుత్వ లెక్కల కంటే రెట్టింపు కేసులు నమోదవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 53 డెంగీ, 6 మలేరియా కేసులు నమోదయ్యాయని, మరో 2వేలకుపైగా సాధారణ జ్వరాలు నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు.



జనగామ జిల్లా ఆస్పత్రిలో ఓపీ కోసం వచ్చిన రోగులు

రూ.వేలల్లో ఆసుపత్రి బిల్లులు

ప్రస్తుత పరిస్థితులు ప్రైవేటు ఆసుపత్రులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. జ్వరాలతో అడ్మిట్ అయిన రోగుల నుంచి వైద్యం, నిర్ధారణ పరీక్షలు, స్కానింగుల పేరుతో రూ.వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు. చిన్నపాటి జ్వరానికే హడావిడి చేస్తున్నారని, డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలైతే ఇక వారి ఇష్టారాజ్యమన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో ఓపీకి వచ్చిన పేషెంట్లకు టెస్టులు, మందులతో కలిపి రూ.5వేలకు పైనే అవుతుండగా అడ్మిట్ వారికైతే రూ.30వేలు, ప్లేట్స్‌లెట్స్ తగ్గడంలాంటి సమస్య వస్తే రూ.50వేలపైనే అవుతున్నాయి. అధికారుల నిఘా లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, డాక్టర్లు 'తాము ఆడిందే ఆట' అన్నట్టుగా వసూలు చేస్తున్నారన్న అభిప్రాయాలున్నాయి.

ఐదేళ్లుగా జిల్లాలో నమోదైన కేసులు

వ్యాధి	2020	2021	2022	2023	2024
డెంగీ	6	15	34	45	53
మలేరియా	6	7	7	8	4
చికున్‌గున్యా	0	0	0	0	0
మొత్తం	12	22	41	53	57





అధికారులతో సెల్ఫీ తీసుకుంటున్న మంత్రి సురేఖ

బంగారు మైసమ్మకు భద్రకాళి ప్రసాదం

వరంగల్‌కల్చరల్, ఆగస్టు 21: హైదరాబాద్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ప్రధాన కార్యాలయం పక్కనే గల బంగారు మైసమ్మ దేవాలయంలో బుధవారం బంగారు బోనం సందర్భంగా భద్రకాళి అమ్మవారి ప్రసాదాన్ని ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారికి అందజేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు కూడా అమ్మవారి ప్రసాదాన్ని ఈవో అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని దేవాదాయ శాఖకు చెందిన మహిళా అధికారులందరితో మంత్రి కొండా సురేఖ పాల్గొని వారితో సెల్ఫీ దిగారు.



పైడిపల్లి ఆలయంలో పూజలో పాల్గొన్న కార్పొరేటర్ షిభారాణి

ఘనంగా పోచమ్మ బోనాలు

పోచమ్మమైదాన్,ఆగస్టు 21: మూడో డివిజన్ పైడిపెల్లిలో బుధవారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన బోనాలకు స్థానిక కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ మహిళలతో కలిసి బోనంసమర్పించారు. డప్పు చప్పుళ్లతో, బోనాలతో సందడి నెలకొంది. రైతు సమన్వయ సమితి మాజీ జిల్లా అధ్యక్షురాలు ఎల్లవుల లలితాయాదవ్ బోనాలతో తరలివచ్చి, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు కసివోజ్జల పూర్ణచందర్, కాంగ్రెస్ నాయకులు జన్ను అనిల్‌కుమార్, జన్ను రాజయ్య, బోయిని ఐలయ్య, ఇట్యాల సతీష్, లింగం కోటిలింగం, కన్నెబోయిన నాగరాజు, కొత్తకొండ గోపి, కంది శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

- ఆరెపల్లిలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని పోచమ్మ బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.
- దేశాయిపేటలో పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కావటి కవితయాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై బోనం ప్రారంభించారు. డాక్టర్స్ కాలనీ-2, గాంధీనగర్, వీవర్స్ కాలనీ, మంగళికుంట ప్రాంతాలలో పోచమ్మ బోనాలు నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో కొంతం సంగీత్, కాశెట్టి వేణు, బూర రమేష్, తుమ్మ సతీష్, గుర్రం చంద్రశేఖర్, వి.రవీందర్ పాల్గొన్నారు.



సోలార్‌పై ఆసక్తి

● సూర్య ఘర్ బిజిలీ కింద కేంద్రం సబ్సిడీ ● 90శాతం రుణం అందిస్తున్న బ్యాంకులు ● పెరుగుతున్న సోలార్ విద్యుత్ ఉత్పత్తి

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 21: రోజురోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ పవర్ ఉత్పత్తి ఆవశ్యకత ఎంతో పెరిగింది. ప్రతీ ఇంట్లో లైట్లు, ఫ్రిజ్, ఈటర్, రైస్ కుక్కర్, ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు, ఐరన్ బాక్స్‌లు, జూస్ మిషన్లు, మిక్సీలు ఇలా ప్రతీదీ వాడేందుకు విద్యుతే అవసరం. ప్రజల అవసరాలకు అనుగుణంగా సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రజలకు ప్రభుత్వాలు అవగాహన కల్పిస్తూ, తగిన ప్రోత్సాహకాలను అందిస్తోంది. గృహ అవసరాల నుంచి పరిశ్రమల వరకు ఉపయోగించుకునేలా సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. ఇందుకు కావాల్సిన రుణాలను బ్యాంకుల ద్వారా అందించడమే కాదు, సబ్సిడీని సైతం ప్రభుత్వాలు అందిస్తున్నాయి. దీంతో ఇప్పుడిప్పుడే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సోలార్ విద్యుత్ వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. చాలామంది విద్యుత్ పలకలను కొనుగోలు చేసి ఇంటిపై ఏర్పాటు చేసుకుంటున్నారు.

సోలార్ పలకలపై సబ్సిడీ..

గృహ అవసరాలకు నెలకు 150 యూనిట్ల(కిలోవాట్) నుంచి 300 యూనిట్ల(3కిలోవాట్లు)వరకు అవసరముంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. వరంగల్, హనుమకొండ వంటి పట్టణాల్లోని పలు ఎలక్ట్రానిక్ షాపులు, మోటార్ విక్రయ కేంద్రాల్లో సోలార్ పలకలను విక్రయిస్తున్నారు. కిలోవాట్ రూ.30వేలు, రెండు కిలోవాట్ రూ.60వేలు, మూడు కిలోవాట్‌కు రూ.90వేలు వరకు సోలార్ పలకల ధర పలుకుతోంది. రూ.90వేల పలకలకు రూ.12వేల సబ్సిడీ ని కేంద్రం ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలీ యోజన పథకం కింద అందిస్తోంది.

బ్యాంకు రుణం..

సోలార్ విద్యుత్ ఉత్పత్తిని బ్యాంకులు ప్రోత్సహిస్తున్నాయి. కిలోవాట్ నుంచి 500 కిలోవాట్ వరకు గృహాలకు, పరిశ్రమలకు ఉపయోగించే వారికి ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ పోను ఉన్న ధరపై 90 శాతం వరకు బ్యాంకులు రుణాన్ని అందిస్తున్నాయి. సొంత ఇల్లు కలిగి, కరెంటు బిల్లు ఓనర్ ఇంటి యజమాని పేరు ఉండి, కరెంటు బిల్లుపై సొంత ఇంటి అడ్రస్ ఉన్న వారికి బ్యాంకులు రుణాలిస్తున్నాయి. ఇందుకోసం ప్రధానమంత్రి సూర్య ఘర్ బిజిలీ యోజన అనే పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు అనంతరం ప్రోత్సాహాలు లభిస్తాయి.

సోలార్ ప్లాంట్లకు రుణాలు అందిస్తాం..



రాజు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్

సోలార్ విద్యుత్‌పై ప్రజల్ని ప్రోత్సహించేందుకు బ్యాంకులు రుణాలను అందిస్తున్నాయి. కేంద్ర పథకం సూర్యఘర్ బిజిలీ పథకం ద్వారా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకొని విద్యుత్‌ను పొందవచ్చు. ప్రభుత్వ సబ్సిడీతోపాటు 90శాతం రుణాలు అందించడం జరుగుతోంది.

మెడికో హత్యాచారం నిరసిస్తూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కరీమాబాద్, ఆగస్టు 21: కోల్‌కతా ఆర్‌జి కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ స్టూడెంట్‌ను హత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గున్నాల ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం కరీమాబాద్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 36గంటలపాటు డ్యూటీ చేసి విశ్రాంతి కోసం వెళ్లిన డాక్టర్‌పై కిరాతకంగా అత్యాచారం చేసి పొట్టన పెట్టుకున్నారని, ఆ కామాంధులను తక్షణమే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిత్యం దేశంలో మహిళలపైన అత్యాచారం హత్యలు జరుగుతున్నాయని, ఈ సంఘటనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి కఠినమైన శిక్షలు విధించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియూ జిల్లా కమిటీ సభ్యులు అప్పాజీ వాణి, ఉపేందర్, ఏరియా నాయకులు ఇస్మాయిల్, యాకుబ్‌పాషా, జుబేదా, సూరయ్య, లక్ష్మి, మహబూబ్, మాసూబీ, మల్లేశం, కిరణ్ పాల్గొన్నారు.

ఆపరేషన్ చేయకుండానే బిల్ క్లైమ్

మరో ఆస్పత్రికి వెళ్లగా బయటపడిన నిజం

అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్న ఆస్పత్రి యాజమాన్యం

లబోదిబోమంటున్న బాధితుడు

వరంగల్ సిటీ, ఆగస్టు 21: నగరంలోని వెంకట్రామ థియేటర్ సమీపంలోని ఓ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో రోగికి ఆపరేషన్ చేయకుండానే చేసినట్లు ఇన్సూరెన్స్ కంపనీ నుంచి బిల్ క్లైమ్ చేసిన ఘటన బుధవారం వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే... 20వ డివిజన్ కాశిబుగ్గకు చెందిన అల్లి రాజేష్ కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ గత శనివారం ఆస్పత్రిలో చేరాడు. మూడు వారాల తర్వాత ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని రాజేష్‌ను బుధవారం డిశ్చార్జి చేశారు. ఇదిలాఉండగా, ఇన్సూరెన్స్ కంపనీ నుంచి రూ.77వేల బిల్ ఆస్పత్రి యాజమాన్యం క్లైమ్ చేసినట్లు రాజేష్ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. అయితే నొప్పిగా ఉండడంతో మూడు వారాలు ఆగే పరిస్థితి లేదని హనుమకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లగా వారు రిపోర్ట్స్‌తోపాటు అతని ఇన్సూరెన్స్ కంపనీ బిల్స్ చూశారు. ఆపరేషన్ అయి రూ.77వేలు క్లైమ్ చేసుకున్నారని రాజేష్‌కు చెప్పారు. దీంతో సదరు ఆస్పత్రి వచ్చి అడిగితే చేసిన వైద్య చికిత్సల మేరకు బిల్ తీసుకున్నట్లు యాజమాన్యం సమాధానం చెప్పడంతో లబోదిబోమంటున్నాడు.

ఆపరేషన్ చేయకుండా బిల్ తీసుకున్నారు..

అల్లి రాజేష్, బాధితుడు



బాధితుడు అల్లి రాజేష్

కిడ్నీ నొప్పితో ఆస్పత్రిలో చేరితే ఓపీ కింద రూ.5వేలు కట్టించుకుని, ఈసీజీ తీసి, 24 గంటలు ఐసీయూలో ఉంచారు. హనుమకొండకు తీసుకు వెళ్లి ఎంఆర్‌ఐ స్కాన్ చేయించారు. సోమవారం ఎండోస్కోపీ చేసినా, సోమ, మంగళవారం చికిత్స చేయలేదు. ఇన్‌ఫెక్షన్ ఉంది మూడు వారాల తర్వాత ఆపరేషన్ చేస్తామని డిశ్చార్జి చేశారు. బిల్ అడిగితే రూ.1.80 లక్షలు అయిందన్నారు. అట్ల ఎట్లైతదని అడిగితే పది నిమిషాల్లో రిపోర్టు మార్చేసి రూ.77వేల బిల్లు వేశారు. తర్వాత నొప్పి తీవ్రమవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి, ఆపరేషన్‌కు సిద్ధమవుతుండగా రిపోర్టులు చూసి నీకు ఆల్ రెడీ ఆపరేషనై బిల్ కూడా క్లైమ్ చేశారని చెప్పారు. మళ్లీ పాత ఆస్పత్రికి వచ్చి అడిగితే నిర్లక్ష్యంగా సమాధానమిస్తూ, రేపు రమ్మంటున్నారు. వైద్య అధికారులు, కలెక్టర్ స్పందించి నాకు న్యాయం చేయాలి.



కమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్లు

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి

కమిషనర్‌కు 'తూర్పు' కార్పొరేటర్ల వినతి

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 21: గ్రేటర్ వరంగల్ పరిధిలో చాలా వరకు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయడంతోపాటు కొత్త పనులకు టెండర్లు పిలవాలని వరంగల్ తూర్పు కార్పొరేటర్లు బుధవారం బల్దియా కమిషనర్‌ను కోరారు. కమిషనర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వెంటనే స్పందించిన కమిషనర్ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



రైల్వేస్టేషన్‌లో భారీ బందోబస్తు

గిర్మాజిపేట, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు నిరసనగా ది రిజర్వేషన్ బచావో సంఘర్ష్ సమితి, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘాలు బుధవారం ఇచ్చిన భారత్ బంద్ సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు బందోబస్తు నిర్వహించారు. బంద్‌లో భాగంగా ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సంఘాల నాయకులు, కార్యకర్తలు రైల్వేస్టేషన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలపెట్టకుండా వారిని రైల్వేస్టేషన్ వైపు రాకుండా రైల్వే రక్షిత దళం(ఆర్‌పీఎఫ్) ఎస్సై జి.వెంకటేష్, జీఆర్‌పీ ఎస్సై ఎం.ఐలయ్య ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ బృందం వరంగల్ రైల్వేస్టేషన్‌లో విస్తృతమైన భద్రతా చేపట్టింది. వరంగల్, శివనగర్ వైపు రైల్వేస్టేషన్ మార్గాల వద్ద రైల్వే పోలీసులు ప్రయాణికుల రాకపోకలను పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లోని నాలుగు ప్లాట్‌ఫారాలపై ప్రయాణికులను తనిఖీ చేశారు. రైలు పట్టాల వైపు ఎవరు వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

మట్టెవాడ పాఠశాలలో సైన్స్‌డే పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21: వరంగల్ మండలంలోని మట్టెవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రీజనల్ సైన్స్ సెంటర్ నిర్వాహకులు సైన్స్ డే పోటీలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు కె.అరుణ ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు డి.కిరణ్‌కుమార్, ప్రభాకర్, రీజనల్ సైన్స్ సెంటర్ నిర్వాహకులు ఎస్. అశోక్‌కుమార్, బి.కీర్తివివేక్ పాల్గొనగా విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

పశువైద్య శిబిరం

ఖిలావరంగల్, ఆగస్టు 21: పశువులలో ఎద లక్షణాలను గమనించి, సమస్యలుంటే వాటిని పశువుల ఆస్పత్రికి తీసుకురావాలని జిల్లా పశు వైద్య అధికారి డాక్టర్‌లు బాలకృష్ణ, కృషి విజ్ఞాన కేంద్రం, మామునూరు కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజన్నలు అన్నారు. బుధవారం ఖిలావరంగల్ తూర్పుకోటలోని పశువుల ఆస్పత్రిలో పీ.వీ. నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రం మామునూర్, వరంగల్ జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 72 పశువులకు గర్భధారణ పరీక్షలు జరిపి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తూర్పుకోట పశువైద్యాధికారి రవిందర్, డాక్టర్‌లు శశాంక్, సా యికిరణ్, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

'సమాజానికి ఉపయోగపడాలి'

శంభునిపేట, ఆగస్టు 20 : సాంకేతిక విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో సమాజానికి ఉపయోగపడాలని వాగ్దేవి విద్యా సంస్థల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సీహెచ్ దేవేందర్‌రెడ్డి అన్నారు. బొల్లికుంట వాగ్దేవి కళాశాలలో బుధవారం ఇంజనీరింగ్ కోర్సులో చేరబోయే విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ కోర్సు ఉద్యోగం కొరకు కాకుండా ఉద్యోగాలు సృష్టించే విధంగా చదవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.ప్రకాశ్, డాక్టర్ సయ్యద్ ముస్తాక్ అహ్మద్, ప్రొఫెసర్ పి.ప్రసాద్‌రావు, ప్రాంగణ నియామకాల డీన్ ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎస్ శర్మ, పరీక్షల కంట్రోలర్ ప్రొఫెసర్ బెనర్జీ, వైస్ ప్రిన్సిపల్ తిరుపతి రావు పాల్గొన్నారు.

'వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి'



దోమల మందు పిచికారి చేపిస్తున్న డీఎంహెచ్‌వో

పోచమ్మమైదాన్, ఆగస్టు 21: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కాజీపేట వెంకటరమణ సూచించారు. కాశిబుగ్గ పట్టణ ఆరోగ్య కేంద్రం, దేశాయిపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రాల పరిధిలో క్షేత్రస్థాయిలో పర్యటించి, జ్వర పీడితులతో మాట్లాడారు. అనంతరం మలేరియా వ్యాధికి గురైన వ్యక్తి ఇంటి చుట్టూ దోమల మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్, భరత్, ఇన్‌చార్జ్ ఏఎంఓ మాడిశెట్టి శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్లు అజయ్, విజయేంద్రకుమార్, హెల్త్ సూపర్వైజర్లు సదానందం, మధుకర్, సీవో జన్ను కోర్నెలు పాల్గొన్నారు.

'వాసవి' ద్వారా సామాజిక సేవ

మట్టెవాడ, ఆగస్టు 21: వాసవి క్లబ్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని స్టేట్ టాక్సేషన్ డిప్యూటీ కమిషనర్ పెద్ది వెంకటేశం అన్నారు. క్లబ్ వరంగల్ అధ్యక్షుడు తోట మార్కండేయ అధ్యక్షతన పిన్నవారి వీధిలోని క్లబ్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం పేద విద్యార్థులకు క్లబ్ తరపున అందించే నెలవారి పింఛన్‌ను అందించారు. కార్యక్రమంలో సెక్రెటరీ పల్లెర్ల వీరన్న, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పృథ్వీరాజ్, జి.సత్యనారాయణ, పుల్లూరి కిషోర్, వాసుదేవులు, సుధాకర్, ఈశ్వర్ పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన టీఎస్జీవోలు



డీఈవోను సత్కరిస్తున్న టీఎస్జీవోస్ నేతలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 21: డీఈవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మామిడి జ్ఞానేశ్వర్‌ను టీఎస్జీవోస్ జిల్లా కమిటీమర్యాదపూర్వకంగా కలిసి సత్కరించింది. బుధవారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో జ్ఞానేశ్వర్‌ను మర్యాద కలిసిన సంఘం నేతలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టీఎస్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుజ్జుల రాంకిషన్, కార్యదర్శి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు రామానుజమ్ జగదీశ్వర్, టీఎస్జీవోస్ విద్యాశాఖ ఫోరం అధ్యక్షుడు ఎస్పీ శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి రామకృష్ణ, మహ్మద్ యాసూఫ్, బాబ్జి, నిరంజన్‌రెడ్డి, మానసనాగరాజు, స్రుజన్ పాల్గొన్నారు.

'ఏసీపీపై చర్యలు తీసుకోవాలి'

మిల్స్‌కాలనీ, ఆగస్టు 21: వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆడెపు వెంకటేష్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారి అయి ఉండి రాజకీయ నాయకుల పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం ఏంటని ప్రశ్నించారు. వృత్తి ధర్మాన్ని తాకట్టుపెడుతూ బర్త్ డే వేడుకల్లో మంత్రిని పొగుడుతూ ప్రసంగించిన తీరును ఖండించారు. సమాజంలో పోలీసులపై గౌరవం ఉందని, ఆ గౌరవాన్ని వారురాజకీయ నాయకులకు ఎలా తాకట్టు పెడుతారంటూ ప్రశ్నించారు. ఆయనతోపాటు మరో లా అండ్ ఆర్డర్ సీఐ, ట్రాఫిక్ సీఐలు పాల్గొన్నారని, వీరిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని సీపీని కోరారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కరీమాబాద్, ఆగస్టు 21: ఉర్సు హరిజనవాడలో పోచమ్మ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు గడ్డం యుగేందర్ గౌడ్ బుధవారం రూ.11వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ పెద్దలు పసునూరి మల్లేశం, పసునూరి రాజు, గోపాల్, రమేష్, రాజబాబు, రాజు, యాదగిరి, మల్లేశం, ధర్మ పాల్గొన్నారు.


భూ క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టాలి..

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 21: భూ క్రమబద్ధీకరణ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ పరిధిలోని భీమారం, చింతగట్టు ప్రాంతాల్లో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తుదారుల భూములను బుధవారం సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సందర్శించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో క్రమబద్ధీకరణ చేసే భూములు, ప్లాట్ల వివరాలను నిబంధనల మేరకు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంచార్జీ సిటీ ప్లానర్ రవీంద్ర రడేకర్, ఏసీపీలు శ్రీనివాస్‌రెడ్డి, రజిత, ఈర్షద్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

పన్నులు వసూళ్లలో పురోగతి అవసరం

పన్నుల వసూళ్లలో సిబ్బంది పురోగతి సాధించాలని బల్దియా కమిషనర్ అశ్విని సూచించారు. బుధవారం బల్దియా కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ యేడు ఆర్థిక సంవత్సరం మొదలై ఐదు మాసాలు గడుస్తున్నా 32.12 శాతం మాత్రమే పన్నుల వసూళ్లు జరిగాయని, ఇంకా వేగంగా ముందుకు వెళ్లాలని అన్నారు. వార్డు అధికారులకు కేటాయించిన ప్రాంతంపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. వార్డు ఆఫీసర్‌లకు ఇచ్చిన లక్ష్యం ప్రకారం ప్రతీ నెల 5 నుంచి 10 లక్షలు వసూలు చేయాలని ఆదేశించినా కొన్ని రోజులుగా ఎలాంటి పన్ను వసూళ్లు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో అదనపు కమిషనర్ చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, పన్నుల విభాగం అధికారి బిర్రు శ్రీనివాస్, ఆర్ఐలు, ఆర్‌వోలు పాల్గొన్నారు.



చింతగట్టులో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు భూములను పరిశీలిస్తున్న కమిషనర్

ఉపాధి యూనిట్లు కేటాయించండి..

అర్హులైన స్వయం సహాయక మహిళా సంఘాలకు ఉపాధి యూనిట్లను కేటాయించాలని బల్దియా కమిషనర్ కోరారు. బుధవారం బల్దియా కార్యాలయంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ల(సీవో)లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్ల కేటాయింపుపై కమిషనర్ మాట్లాడి పలు సూచనలు చేశారు. ప్రతీ సీవో వారంలో 10 యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా పని చేయాలన్నారు.

ఎస్ఎస్‌జీ బృందాలకు బ్యాంకు లింకేజీలు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా సీవోలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో కోల రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, సీవోలు సకినాల రమేష్, శ్రీలత, రాజ్‌కుమార్, స్వాతి, సునీల్, రజిత, అలీ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు	2,702	2,611
పల్లికాయ(పచ్చిది)	4,200	3,400
పల్లికాయ(సూక)	6,260	5,400
పత్తి	7,500	5,000
పసుపు(కాడి)	12,273	12,159
పసుపు(గోల)	12,156	11,059
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,500	14,000
వండర్‌హాట్ ఏసీ	16,000	12,000
యూఎస్341 ఏసీ	10,500	8,000
తాలు మిర్చి	6,500	3,000



మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పర్వతగిరి, ఆగస్టు 21: 'నాటుదాం ఒక మొక్క-అమ్మ పేరు మీద'(ఏక్ పేడ్ మా కే నామ్) పేరిట మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం నిర్వహించే మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో మొక్కలు నాటించాలని, వ్యక్తిగత మరుగుదొడ్లకు రెండు గుంతలు ఉండాలని, ఓటర్ లిస్టు మ్యాపింగ్ త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం ఇటీవల బదిలీపైవెళ్లిన సూపరింటెండెంట్ ఆయేషా పర్వీన్, కార్యదర్శులు హుస్సేన్, చిరంజీవిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాసులు, ఏపీవో సుశీల్‌కుమార్, సూపరింటెండెంట్ రూపేష్, ఈసీ రాజు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతులు దరఖాస్తు చేసుకోవాలి

దుగ్గొండి, ఆగస్టు 21: అన్ని రకాల అర్హతలు ఉండి సాంకేతిక లోపాలతో రూ.2లక్షల వరకు రుణమాఫీ కాని రైతులు ఫిర్యాదు చేయాలని మండల వ్యవసాయ అధికారి బానోతు మాధవి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన పంట రుణాలు మాఫీ కాని రైతుల వివరాలు తెలిపితే సాంకేతికమైన లోపాలు తొలగించి మాఫీ చేసే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఆధార్ కార్డు నంబరు తప్పుగా నమోదు కావడం, బ్యాంకుకు లింకు కాకపోవడం తదితర సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినందున రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ రైతు సమస్య తీర్చి పంట రుణం మాఫీ చేయడం జరుగుతుందన్నారు. ఫిర్యాదులకు నియమిత గడువు లేదని, నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఏవో మాధవి పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరుపై దృష్టి సారించాలి : డీఐఈవో


నెక్కొండలోని మోడల్ స్కూల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

నెక్కొండ, ఆగస్టు 21: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఉత్తీర్ణతతో పాటు విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి సారించి వారి సంఖ్యను పెంచాలని డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ అన్నారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రికార్డుల ప్రకారం విద్యార్థుల హాజరుశాతం తక్కువగా ఉన్నందున పరీక్షల్లోగా పెంచాలని ఆదేశించారు. అలాగే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు బోధనా పద్ధతులను మెరుగు పర్చాలన్నారు. విద్యార్థులకు అవసరమైన గ్రంథాలయాలు, సైన్స్ ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రణయ్‌కుమార్, ఇన్‌చార్జ్ ఉదయశ్రీ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ తాటిపత్రి అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీడీపీవో మధురిమకు సన్మానం


పట్టణంలోని రైతు వేదికలో సీడీపీవోను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్

నర్సంపేట, ఆగస్టు 21: హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా పనిచేసి ఐసీడీఎస్ నర్సంపేట సీడీపీవోగా బదిలీపై వచ్చిన మధురిమను హనుమకొండ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. నర్సంపేటపట్టణంలోని రైతు వేదిక భవనంలో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దామెర నర్సయ్య, ప్రధాన కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ హనుమకొండ సంక్షేమ అధికారిగా పనిచేసిన సమయంలో మధురిమ సీనియర్ సిటిజన్స్ కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా నర్సంపేటకు బదిలీపై వచ్చిన ఆమెను సన్మానించామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాజేందర్, యాదగిరి, సాంబయ్య, ఏసీడీపీవో హేమలత, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ కార్తీక్, సూపర్‌వైజర్లు ఝాన్సీ, మాధవి, పోషణ్ అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీలత, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు గొర్రె రాధ, బత్తిని శిరీష, కోశాధికారి పల్లెపాటి రాణి, డి.రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

చెన్నారావుపేట, ఆగస్టు 21: మండలంలోని అమీనాబాద్ గ్రామంలో బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్దెన రమేష్, మండల యూత్ అధ్యక్షుడు బండి హరీష్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కద్దూరి సంపత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చీర అశోక్, పత్తినాయక్, బాటోతు స్వామినాయక్, వెంకటనర్సు, ఐత తిరుపతి, శంకర్, శ్రీనువాస్, సుధాకర్ పాల్గొన్నారు.

ఎస్ఐలు లేక ఆరు నెలలు

నర్సంపేట పోలీస్‌స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోనే దిక్కు

- ఇక్కడికి వచ్చేందుకు ఎస్ఐల విముఖత
- సిబ్బంది కొరతతో పనిభారం
- ఇటీవల పెరిగిన నేరాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



నర్సంపేట టౌన్, ఆగస్టు 21 : వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఆధునిక టెక్నాలజీతో ఏర్పాటైన మోడల్ పోలీస్‌స్టేషన్‌లో ఒకటైన నర్సంపేటకు ఎస్సైలు రావడానికి జంకుతున్నారు. ఈ ఆరు నెలల్లో కమిషనరేట్ పరిధిలో ఎస్సైల బదిలీలు జరగ్గా, ఇక్కడికి వచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తుండడం చర్చనీయాంశమైంది. కమిషనరేట్ పరిధిలో ఉన్నతాధికారుల నుంచి ఎస్‌హెచ్‌వోల వరకు స్థాన చలనం జరిగింది. ఇందులో నర్సంపేట మోడల్ స్టేషన్ అధికారులు ఉన్నారు. అప్పటి వరకు నర్సంపేటలో ఎస్‌హెచ్‌వోతో పాటు ముగ్గురు ఎస్సైలు విధులు నిర్వర్తించేవారు. వీరికితోడు ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్స్ ఉండేవారు. ఇప్పుడు ఎస్‌హెచ్‌వోనే దిక్కయ్యారు. ఇంకా ముగ్గురు ఎస్ఐ పోస్టులు ఖాళాగానే ఉన్నాయి. ఆరు నెలల నుంచి ఎస్ఐ లేకుండానే స్టేషన్ నిర్వహణ సాగడంతో శాంతిభద్రతల పరిరక్షణ కష్టంగా మారుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, చోటామోటా నాయకులు తమ తమ పరిధిలోని చిన్న సమస్యలకైనా, పెద్ద సమస్యలకైనా ఎస్‌హెచ్‌వోనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఎస్సైలు ఉంటే రూరల్ ఒకరికి, టౌన్ ఒకరికి, ట్రాఫిక్ మరొకరి ఇలా పనులను కేటాయించేవారు. దీని వల్ల సిబ్బందితో పాటు ప్రజలకు అనుకూలంగా ఉండేది.

పెరుగుతున్న నేరాలు.. ఫిర్యాదులు

నర్సంపేట స్టేషన్ పరిధిలో ఇటీవల నేరాలు పెరిగిపోతున్నాయి. గంజాయి మత్తులో నర్సంపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో ఇటీవల ఓ బెల్టు షాపు యజమాని హత్యకు గురయ్యాడు. గత నెల 26న మహేశ్వరం సమీపంలోని దాబాలో యువకుడిపై మరో ముగ్గురు యువకులు మద్యం మత్తులో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ నెల 3న పట్టణంలోని మల్లంపల్లిరోడ్‌లో అక్రమంగా తరలిస్తున్న 250 కిలోల గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. పేకాటరాయుళ్ల ఆగడాలు కూడా పెరిగిపోయాయి. వీటికితోడు సిబ్బంది కొరతతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఎస్సైలను వెంటనే నియమించడంతో పాటు సిబ్బంది కొరతను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నార్థకంగా శాంతిభద్రతలు..

స్టేషన్‌లో ఇప్పటికే సిబ్బంది కొరత వేధిస్తోంది. కానిస్టేబుల్స్ 50కి పైగా ఉండాల్సి ఉండగా కేవలం 21 సిబ్బంది మాత్రమే ఉన్నారు. దీంతో పని భారం పడుతోందని సిబ్బంది వాపోతున్నారు. పని ఒత్తిడితో కొందరు బదిలీలు చేసుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో నియోజకవర్గ కేంద్రమైన నర్సంపేట పట్టణంతో మండలంలోని వివిధ గ్రామాల్లో శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. గ్రామపంచాయతీ ఎన్నికలు సైతం సమీపిస్తుండడంతో ఎప్పుడు ఎలాంటి సంఘటనలు జరుగుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో పరిస్థితులున్నాయి. అవి కాస్తా ఎన్నికలు వచ్చేవరకు తీవ్ర రూపం దాల్చే అవకాశం లేకపోలేదనేది స్థానికులు భావిస్తున్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన సంస్థ రాష్ట్ర చైర్మన్

నర్సంపేట, ఆగస్టు 21: నర్సంపేట పట్టణంలోని గ్రంథాలయాన్ని బుధవారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ సందర్శించారు. పుస్తకాల ర్యాకులు, రీడింగ్ గదిని పరిశీలించి గ్రంథాలయంలోని సమస్యలను లైబ్రేరియన్ పద్మారావు, చిన్నబాబు ద్వారా తెలుసుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రుల సహకారంతో గ్రంథాలయ భవనంపై నూతన భవనం నిర్మించ డానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం లైబ్రేరియన్ పద్మారావు, పాఠకులతో కలిసి గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో గ్రంథా లయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ శ్రీనివాసరావు

వర్ధన్నపేట, ఆగస్టు 21: వర్ధన్నపేట సీఐగా కొమ్మూరి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా గతంలో పనిచేసిన సీఐ సూర్యప్రకాష్ బదిలీపై వెళ్లగా, కొమ్మూరి శ్రీనివాసరావు చార్జ్ తీసుకున్నారు. ఈ మేరకు సీఐ శ్రీనివాసరావు ఏసీపీ అంబటి నర్సయ్యను మర్యాపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కాగా, సీఐకి వర్ధన్నపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, అదనపు ఎస్ఐ మేరుగు రాజు శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 21: మండలంలోని నల్లబెల్లి హనుమాన్ ఆలయ పునర్నిర్మాణానికి జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్ దంపతులు బుధవారం విరాళం అందజేశారు. ఆలయ కమిటీ బాధ్యులకు రూ.11,116 నగదును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ పునర్నిర్మాణం ఎంతో సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దోమకొండ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామిని దర్శించుకున్న సీఎం ఓఎస్‌డీ


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న నాయకులు

గీసుగొండ, ఆగస్టు 21: గీసుగొండ మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయాన్ని సీఎం ఓఎస్‌డీ వేముల శ్రీనివాస్ కుటుంబసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. శ్రీనివాస్ మనవడి పుట్టు వెంట్రుకలను సమర్పించి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారు తమ కుటుంబ ఇలవేల్పు అని ఆయన చెప్పారు. ఎండోమెంట్ ద్వారా ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందిస్తా నని చెప్పారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజుద్దీన్, ఆర్ఐ సాంబయ్య, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొండేటి కొమురారెడ్డి, ఎం.డీజావీద్, ఆకుల రుద్రప్రసాద్, వీరగోని కృష్ణమూర్తి, అర్చకులు మురళీకృష్ణ, పాకాల శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

నేటి ధర్నాను విజయవంతం చేయాలి

నర్సంపేట, ఆగస్టు 21: ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం 10.30 గంటలకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. పట్టణంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. పట్టణంలోని అన్ని వార్డులకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈసమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు మండల శ్రీనివాస్, వాసం సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్యసేవలు

డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్

చెన్నారావుపేట, ఆగస్టు 21: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడానికే వైద్య శిబిరం ఏర్పాటు చేశామని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఐ.ప్రకాష్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు రకాల రోగాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రజలు వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. శిబిరంలో పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు శశికుమార్, జ్యోత్స్న, రాజు, మనోజ్ఞ, రాజానాయక్, సీహెచ్. జ్యోతి, అర్జున్, శ్రవణ్, మట్ట భారత్‌కుమార్, వాసవి, మహేందర్‌రెడ్డి, భద్రయ్య, శ్రీధర్‌రాజు, ఎం.రషీద్, డాక్టర్ సరోజ, ఎస్.శ్రీవాణి, రషీద్ పాల్గొన్నారు. కాగా, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలోని రైతు వేదికలో మెగా వైద్య శిబిరంను ఏర్పాటు చేయటంతో రోగుల నుంచి స్పందన పెద్దగా కనిపించలేదు. మొదట గ్రామంలోని జీపీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని చెప్పిన అధికారులు మళ్లీ పీహెచ్‌సీకి పక్కనే ఉన్న రైతు వేదికలో ఏర్పాటు చేయడంతో రోగులు పోలేక ఇబ్బందులు పడ్డారు.


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రకాష్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు
- పట్టణంలో బైక్‌ను ఢీకొట్టిన లారీ


రాహుల్‌రెడ్డి (ఫైల్)

వర్ధన్నపేట, ఆగస్టు 21: రాత్రివేళ ఇంట్లో అన్నం లేకపోవడంతో రొట్టెలు తిందామని దాబా హోటల్‌కు వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఓయువకుడు బలయ్యాడు. ఈ సంఘటన వర్ధన్నపేట పట్టణంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన ప్రకారం... పట్టణానికి చెందిన ఎడ్ల రాహుల్‌రెడ్డి (22) కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 20న రాత్రి ఇంటికి చేరుకుని భోజనం చేద్దామని అనుకోగా అన్నం లేదు. దీంతో చేసేదేమి లేక డీసీతండా వద్ద ఉన్న రాజస్థాన్ హోటల్‌లో రొట్టెలు తిందామని తన స్నేహితుడు ఎండీ గౌస్‌పాషా బైక్‌పై (రాహుల్‌రెడ్డి బైక్ నడుపుతుండగా గౌస్ పాషా వెనకలా కూర్చుకున్నాడు) వెళ్లాడు. ఈ క్రమంలో వర్ధన్నపేట నుంచి డీసీతండాకు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై వెళ్తుండగా తహసీల్దార్ కార్యాలయం దాటిన తర్వాత తొర్రూరు నుంచి వరంగల్ వైపు వస్తున్న లారీ ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలైన ఇద్దరిని స్థానికులు గమనించి వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. బుధవారం చికిత్స పొందుతూ రాహుల్‌రెడ్డి మృతి చెందగా, గౌస్ పాషాకు తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నాడు. కాగా, రాహుల్‌రెడ్డి తండ్రి ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రావు



పర్వతగిరి, ఆగస్టు 21: బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కల్లెడ గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు నియామకమయ్యారు. ఈ మేరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి వైస్ ఎంపీపీగా సేవలందించిన రాజేశ్వర్‌రావుకు చిన్నవయస్సులోనే మండల అధ్యక్ష పదవి రావడంతో పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరినీ కలుపుకునిపోయి పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు.

బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా శ్రవణ్‌కుమార్

రాయపర్తి, ఆగస్టు 21: మండల కేంద్రానికి చెందిన ఎనగందుల శ్రవణ్‌కుమార్‌ను బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు చేవేళ్ల మహేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ తనను నమ్మి పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని గ్రామీణ స్థాయిలో మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

ఆయిల్ పాం సాగుతో రైతులకు మేలు

- ఉద్యానశాఖ అధికారులు


గవిచర్లలోని రైతు వేదికలో రైతులతో ఉద్యానశాఖ అధికారులు

సంగెం, ఆగస్టు 21: ఆయిల్ పాం సాగుతో రైతులకు మేలు కలుగుతుందని ఉద్యానశాఖ అధికారులు, రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ అధికారులు చెప్పారు. బుధవారం గవిచర్లలోని రైతుల వేదికలో ఆయిల్ పాం రైతులకు సాగు విధానంపై శిక్షణ ఇచ్చారు. రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ సతీష్‌నారాయణ్ మాట్లాడుతూ రైతులకు లాభదాయకంగా ఆయిల్ పాం సాగు పంట ఉంటుందన్నారు. ఇప్పటివరకు కంపెనీ పరిధిలో 57వేల ఎకరాల సాగు చేస్తున్నామని, ఈ సంవత్సరం 2వేల ఎకరాలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అయితే మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జి.సంగీత మాట్లాడుతూ ఆయిల్ పాం సాగు జిల్లాలోని వ్యవసాయ భూములు అనుకూలంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో నెటాఫిమ్ ఆగ్రోనమిస్టు సుబ్బారావు, వరంగల్ ఉద్యావన అధికారి తిరుపతి, టెక్నికల్ అధికారి రాకేష్, రైతులు గూడ సుదర్శన్‌రెడ్డి, కద్దూరి చంద్రయ్య దౌలత్‌బాజీ గోవర్ధన్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రాయపర్తి, ఆగస్టు 21: మండలంలోని కొండూరు గ్రామానికి చెందిన చినపెల్లి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, బుధవారం అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి రూ.6500 నగదు అందించారు. కార్యక్రమంలో పెండ్లి వెంకన్న, పెండ్లి రవీందర్, రాకేష్, వరుణ్‌కుమార్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బానోతు లక్‌పతి తల్లి ఝూమల్లీ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ఆదేశాల మేరకు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమానాయక్, మండల పార్టీ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, చిర్ర మల్లయ్య, మాదాటి సుదర్శన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, దూలిశెట్టి రాజు, నర్సింహమూర్తి, యాకూబ్‌రెడ్డి, పాషా, వేణులు బుధవారం పరామర్శించారు.

• చెన్నారావుపేట: మండల కేంద్రానికి చెందిన పబ్బతి ప్రతాప్‌రెడ్డి అనే ఆటోడ్రైవర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి బుధవారం రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి, యూనియన్ అధ్యక్షుడు బండారి సత్యంగౌడ్, నాంపెల్లి సంపత్, ముదురుకోళ్ల భిక్షపతి, సాదు రాజు, ప్రధాన కార్యదర్శి కోట్టం మోహన్, క్యాషియర్ ఉప్పుల రాజు, అంద్ర చిన్నయ్య, కరెడ్ల రాజు, జంగిలి ప్రశాంత్ పాల్గొన్నారు.

వైద్యురాలిపై హత్యాచారం చేసిన దుండగులను శిక్షించాలి

నర్సంపేట, ఆగస్టు 21: కోల్‌కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఐఎఫ్‌టీయూ(న్యూ) రాష్ట్ర అధ్యక్షుడు మోడెం మల్లేశం డిమాండ్ చేశారు. పట్టణంలోని సంఘం కార్యాలయంలో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యురాలిపై హత్యాచారం ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో చింతం యాకయ్య, రొట్టె శ్రీనివాస్, చిన్నపెల్లి పోశాలు, గాదం రవి, ఇప్పబాబు, ఏసుపతి, గడ్డం శ్రీనివాస్, ఐలన్న, బొల్లెన రమేశ్, భద్రు, లింగన్న, సది, రవి, శ్రీకాంత్, రాజు పాల్గొన్నారు.


నర్సంపేటలో నినాదాలు చేస్తున్న ఐఎఫ్‌టీయూ(న్యూ) నేతలు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నల్లబెల్లి, ఆగస్టు 21: నల్లబెల్లిలో గ్రామానికి చెందిన మార్త రాంబాబు(50) చిరు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంబాబు ఒక కాలును పూర్తిగా తొలగించారు. దీంతో అంగవైకల్యంతోపాటు ఆర్థిక సమస్యలు తలెత్తడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఉరివేసుకున్నాడు. ఘటనా స్థలికి పోలీసులు వెళ్లి పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు. రాంబాబుకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

పాపయ్యపేటలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

చెన్నారావుపేట, ఆగస్టు 21 : మండలంలోని పాపయ్యపేటలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన సంఘటన బుధవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన ఓవ్యక్తి తన ఇంట్లో, వ్యవసాయ బావి వద్ద గుప్తనిధులున్నట్లు మంగళవారం భూత వైద్యులు చెప్పడంతో రాత్రి సమయంలో రెండు చోట్ల తవ్వకాలు చేశాడు. గ్రామస్థుల సమాచారంతో పోలీసులు తవ్వకాలు జరిపిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. ఓ వ్యక్తి ఇంట్లో తవ్వకాలు జరిగినట్లు గుర్తించామని, ఆ వ్యక్తితో పాటు మరికొందరిని అదుపులోకి తీసుకున్నామని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఖానాపురం, ఆగస్టు 21: ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి, నగదును చోరీ చేశారు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై రఘుపతి తెలిపిన ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన కొత్తపెల్లి క్రాంతికుమార్-లత దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. క్రాంతికుమార్ పనులకు వెళ్లగా లత ఇంటి వద్ద ఉంది. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కుమార్తెకు జ్వరం వచ్చిందని ఫోన్ రావడంతో లత ఇంటికి తాళంపెట్టి పాఠశాలకు వెళ్లి కుమార్తెను ఆస్పత్రిలో చూపించి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళం పగులగొట్టి రూ.59వేల విలువైన బంగారం, వెండి ఆభరణాలతో పాటు రూ.10వేల నగదును దొంగిలించారని లత ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

దమ్మన్నపేటలో షార్ట్ సర్క్యూట్

వర్ధన్నపేట రూరల్, ఆగస్టు 21: మండలంలోని దమ్మన్నపేటలో ఓ గుర్తు తెలియని వ్యక్తి విద్యుత్ సరఫరాకోసం అక్రమంగా కనెక్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించి క్రమంలో ఇనుప కొక్కెం ప్రమాదవశాత్తు 11 కేవీ వైరుకు తగలడంతో షార్ట్ సర్క్యూట్ జరిగింది. గ్రామంలోని ఆలయ సమీపంలో ఓ వ్యక్తి మంగళవారం రాత్రి విద్యుత్ కోసం వైర్లు తగిలించే ప్రయత్నం చేయగా 11కేవీకు తగిలి షార్ట్ సర్క్యూట్ జరిగి పలు ఇళ్లలోని విద్యుత్ మీటర్లతో పాటు గృహోపకరణాలు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద భారీ శబ్దం రావడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. గ్రామ శివారులో ఉన్న సబ్‌స్టేషన్‌లో సైతం విద్యుత్ ట్రిప్ కావడంతో పాటు పీటీఆర్ ఫ్యూజ్ కాలిపోయి, బాన్స్ లేటర్లు తెగి, ఇన్సలేటర్లు సైతం పగిలిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో తమకు ఆస్తి నష్టం జరిగిందని, నష్టాన్ని అంచనా వేసి విద్యుత్ అధికారులు పరిహారం అందించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నామని విద్యుత్ ఏఈ తరుణ్ తెలిపారు. కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

దుగ్గొండి, ఆగస్టు 21: మండల కేంద్రంతో పాటు శంబయ్యపల్లిలో బుధవారం పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. శంబయ్యపల్లిలో ఎల్లమ్మ పూజారి తొగరు పవన్‌స్వామి ఆధ్వర్యంలో శివసత్తుల నృత్యాలతో డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలు ఎత్తుకొని పోచమ్మ దేవాలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. రాజశేఖర్, సబిత, పద్మలు బోనాలతో ప్రత్యేకతను చాటుకున్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు (క్వింటాకు)



పంట	గరిష్ట ధర	కనిష్ట ధర
మక్కలు	2,702	2,611
పల్లికాయ(పచ్చిది)	4,200	3,400
పల్లికాయ(సూక)	6,260	5,400
పత్తి	7,500	5,000
పసుపు(కాడి)	12,273	12,159
పసుపు(గోల)	12,156	11,059
తేజ మిర్చి	12,500	10,000
తేజ ఏసీ	18,500	14,000
వండర్‌హాట్ ఏసీ	16,000	12,000
యూఎస్341 ఏసీ	10,500	8,000
తాలు మిర్చి	6,500	3,000